డ్రగ్స్ విక్రయానికి యత్నం.. ఇద్దరు అరెస్ట్

మరో వినియోగదారుడు కూడా..

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ సప్లై చేస్తున్న ఇద్దరు పాత నేరస్థులతోపాటు ఒక వినియోగదారుడిని సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అంబర్‌పేట్‌కు చెందిన సోలోమెన్ సుసాయ్‌రాజ్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. కొకైన్, ఎండీఎంఏ , గంజాయి తీసుకుంటూ 2021లో స్నేహితుడు అబ్దుతో కలిసి డ్రగ్స్ దందా చేశాడు. రెండు సార్లు పోలీసులకు పట్టుబడ్డారు. 2023లో ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేయడంతో జైలుకు వెళ్లగా.. అక్కడే వేరే కేసులో ఉన్న అంబర్‌పేట్‌కు చెందిన షేక్‌గౌస్ పరిచయం అయ్యాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత వారిద్దరూ కలిసి డ్రగ్స్ తెచ్చి విక్రయించాలనున్నారు. ఈ క్రమంలో గత నెలలో బెంగుళూర్‌కు చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ బ్లాట్స్ కొనుగోలుచేసి.. వాటిని హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అంబర్‌పేట్‌లో వారిద్దరూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కారు. అలాగే తార్నాకకు చెందిన మహేశ్ డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 3.35 లక్షల విలువైన ఆరు గ్రాముల కొకైన్, 15 గ్రాముల ఎండీఎంఏ, తదితర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇల్లు కేటాయించండి..

కలెక్టరేట్ ప్రజావాణికి 1.637 ఫిర్యాదులు

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : తమకు ఇల్లు లేదని.. ఇల్లు కేటాయించాలంటూ కోరుతూ.. కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు నగరవాసులు దరఖాస్తులు అందించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 1,637 దరఖాస్తులు రాగా.. ఇందులో 1,593 దరఖాస్తులు ఇండ్లకు సంబంధించినవేనని అదనపు కలెక్టర్ కదిరవన్ తెలిపారు. పెన్షన్ 19, విద్యాశాఖ 6, తదితర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు రామకృష్ణ, జిల్లా అధికారులు ఆశన్న, డీఈఓ రోహిని, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల అవినీతిపై విచారణ..

గంజాయి డాన్ నీతూబాయిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం

అక్రమాలను సహించేది లేదు.. ఆబ్కారీ ఈడీ వీబీ కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులపై వస్తున్న అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి స్పందించారు. వెంటనే అధికారులపై వస్తున్న అవినీతి, ఆరోపణల మీద విచారణ జరిపేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వారం, పది రోజుల్లో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని దర్యాప్తు బృందాన్ని ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఈడీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. అంతే కాకుండా గంజాయి డాన్ నీతూబాయిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. శేరిలింగంపల్లి పరిధిలోని నానక్‌రామ్‌గూడకు చెందిన నీతూబాయిపై ఇప్పటికే ఆబ్కారీ పోలీసులు 25 కేసులు, లాండ్ ఆర్డర్ పోలీసులు మరో 7కేసులు నమోదు చేశారని, అయినా నిందితురాలి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో రెండు సార్లు పీడీ చట్టం ప్రయోగించి ,రెండు సార్లు జైలుకు పంపించడమే కాకుండా గంజాయి అమ్మకాలతో కూడబెట్టిన రూ.15.17లక్షల స్థిర, చర ఆస్తులను, ఆమె కుటుంబ సభ్యులైన మధుబాయి నుంచి రూ.25.13లక్షలు, గౌతమ్ సింగ్ నుంచి రూ.91.21లక్షల అక్రమ ఆస్తులను సైతం జప్తు చేయడం జరిగిందని ఈడీ వివరించారు. ఐటీ కారిడార్ ఉన్న నానక్‌రామ్‌గూడ, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో గంజాయిని పూర్తిగా రూపుమాపేందుకు ధూల్‌పేట తరహాలో స్థానికంగా ప్రత్యేక ఎక్సైజ్ బృందాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ బృందాలు ఇక నుంచి ప్రతి నిత్యం గంజాయి, డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వంటి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతినిత్యం తనిఖీలు నిర్వహిస్తారని ఈడీ వెల్లడించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలోని అమర్ రాజా బ్యాటరీ కంపెనీలో అగ్నిప్రమాదంతో చెలరేగుతున్న మంటలు

బ్యాటరీ కంపెనీలో అగ్నిప్రమాదం..

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 23 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న బ్యాటరీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలోని అమర్ రాజా బ్యాటరీ కంపెనీ నిర్మాణం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా.. సోమవారం సాయంత్రం 5.10 10 నిమిషాల సమయంలో నిర్మాణంలో ఉన్న 5వ అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తుండగా మంటలు కింద నాలుగో అంతస్తులో ఉన్న ఫ్లైఉడ్ షీట్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి దాదాపు 2 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాద సమయంలో కంపెనీలో 150 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై కంకర.. అదుపుతప్పిన బైక్

చెట్టును ఢీకొని యువకుడు మృతి

మేడ్చల్, డిసెంబర్ 23 : రోడ్డుపై పడిన కంకరతో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం...మేడ్చల్ మండలం, శ్రీరంగవరం పంచాయతీ పరిధిలో ఉన్న కుమ్మరిగడ్డకు చెందిన తప్పరి మధు(26) సోమవారం రాయిలాపూర్‌వైపు నుంచి కుమ్మరిగడ్డకు బైక్‌పై వెళ్తున్నాడు. అయితే రోడ్డుపై ఉన్న కంకర కారణంగా వాహనం అదుపు తప్పి, చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మధు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. రాయిలాపూర్, గిర్మాపూర్, బండమాదారం గ్రామాల పరిధిలో ఉన్న క్రషర్ మిషన్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపై కంకర పడుతున్నది. దీంతో వాహనాలు అదుపుతప్పి కిందపడి పలువురు మృతి చెందుతుండగా, మరికొందరు గాయాలపాలవుతున్నారు.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై కంకర పడకుండా క్రషర్ మిషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అవయవదానం

వసంత్ (ఫైల్)

రామంతాపూర్,డిసెంబర్ 23 : బ్రెయిన్‌డెడ్‌తో డిగ్రీ విద్యార్థి గుండెల్లి వసంత్ (20) ఈనెల 21న కామినేని దవాఖానలో మరణించాడు. ఈ క్రమంలో ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన వసంత్ కుటుంబ సభ్యులు మృతుడి అవయవాలను కామినేని ఆసుపత్రికి దానం చేశారు.

గంజాయి మత్తులో దంపతులపై దాడి

మెహిదీపట్నం, డిసెంబర్ 23 : గంజాయి మత్తులో నలుగురు వ్యక్తులు దంపతులపై దాడిచేసి చంపుతామని బెదిరించారు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ హాశంనగర్‌లో నివసించే సయ్యదా ముబిన్ పాతిమా, మీర్ అమీర్‌అలీ దంపతులపై శనివారం రాత్రి ఇంటి వద్ద దాడి జరిగింది. గంజాయి మత్తులో మీర్ అమీర్ అలీ స్నేహితుడైన హాజీ, అబ్దుల్ హసన్, మరో ఇద్దరితో కలిసి వీరిపై దాడి చేసి చంపుతానని బెదిరించి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం లంగర్‌హౌస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణానికి వెళ్తుండగా ఢీకొట్టిన లారీ

తల్లి మృతి, కూతురు, మనుమరాలికి గాయాలు

అల్లాపూర్, డిసెంబర్ 23 : అతి వేగంగా దూసుకువచ్చిన లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బాలానగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం..బాలానగర్‌కు చెందిన సంతోశ్‌దేవి(54), తన కూతురు పూజా జైన్, మనుమరాలు ఖుష్బూ(8)లతో స్కూటీపై ఫతేనగర్‌లోని తమ దుకాణానికి బయలుదేరారు. మార్గమధ్యలో వెనక నుంచి అతివేగంగా దూసుకువచ్చిన లారీ.. వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంపై వెనక కూర్చున సంతోశ్‌దేవి రోడ్డుపై పడిపోగా...ఆమెపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వాహనం నడుపుతున్న పూజా జైన్ , ఖుష్బూలకు గాయాలయ్యాయి. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాధన రష్మి పెరుమాళ్

విడాకులకు నిరాకరించడంతోనే హత్య

నిందితులు అరెస్ట్.. పరారీలో మరొకరు

బొల్లారం, డిసెంబర్ 23: బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి ఆలీ కాంప్లెక్స్ వద్ద ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. విడాకులకు నిరాకరించడంతోనే యువకుడిని హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ వివరాలు వెల్లడించారు. గత ఏడాది కిందట మృతుడు సమీర్(20), లోయర్ ట్యాంక్ బండ్‌కు చెందిన మహ్మద్ షబ్బీర్ అహ్మద్ కుమార్తె ఫిర్దోస్ సదాఫ్ ఇంటి నుంచి వెళ్లిపోయి బెంగుళూరులో వివాహం చేసుకున్నారు. పెళ్లయిన కొన్ని రోజుల తర్వాత ఇరు కుటుంబాల మధ్య గొడవలు తలెత్తాయి. పెద్దల సమక్షంలో ఘనంగా పెళ్లి జరిపిస్తామని నమ్మించి అమ్మాయిని తీసుకువచ్చి సమీర్‌కు విడాకుల నోటీసులు పంపించారు. విడాకులకు సమీర్ నిరాకరించడంతో పాటు అమ్మాయితో రహస్యంగా మాట్లాడుతున్నాడు. దీంతో సమీర్‌పై కక్షపెంచుకున్న ఫిర్దోస్ తండ్రి అతడిని చంపేందుకు ప్రణాళిక రచించాడు. పథకం ప్రకారం రెక్కీ నిర్వహించి సమీర్‌ను ఈనెల 21న మహ్మద్ ఓమర్, అబ్దుల్ మాటీన్(రౌడీ షీటర్), సయ్యద్ సోహెల్(రౌడీ షీటర్), షేక్ అబు బకర్ సిద్ధిఖ్, ఇబ్రహీంతో కలిసి కత్తులతో సమీర్‌ను పొడిచి హత్య చేసి పారిపోయారు. కొందరు నిందితులను నిజామాబాద్, వరంగల్ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. ఇబ్రహీం పరారీలో ఉన్నాడు. సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, బోయిన్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ రెడ్డి, డీఐ సర్ధార్ నాయక్, ఎస్సైలు నాగేందర్, గిరిధర్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

PMR LAW COLLEGE
(PMR Education & Development Society)
(Affiliated to Osmania University and Approved by the Bar Council of India)
Address: Plot No. 1, Saraswathi Nagar, L.B. Nagar, Hyderabad-500 074.
E-Mail: pmrlawcollege@gmail.com, Website: www.pmrlawcollege.in

RECRUITMENT NOTIFICATION
Assistant Professors in Law

For details regarding Qualifications, Experience etc., please refer to the College Website: **www.pmrlawcollege.in**. Candidates desirous of applying may send their detailed Resume along with copies of relevant Certificates, Passport size Photo etc., in support of their Qualification & Experience to the undersigned by Post or E-mail within 30 days of this Notification.

Date: 22-12-2024 **Secretary**

ముగిసిన నికేశ్‌కుమార్ కస్టడీ..

ఒక్కరోజు ముందుగానే ఏసీబీ కోర్టులో హాజరు.. రిమాండ్‌కు తరలింపు

కీలక విషయాలు సేకరించిన ఏసీబీ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన రంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ ఏఈఈ నికేశ్‌కుమార్ నుంచి కస్టడీ సమయంలో ఏసీబీ అధికారులు కీలక సమాచారాన్ని సేకరించారు. అతని నుంచి ట్యాక్స్ రిటర్న్ పత్రాలను సైతం ఆధారాల కోసం తీసుకున్నారు. కస్టడీ సమయం ఒక్కరోజు మిగిలి ఉండగానే నిందితుడిని ఏసీబీ కోర్టు ఎదుట హాజరుపర్చారు. నాలుగు రోజుల కస్టడీకి తీసుకున్న అధికారులు మూడు రోజుల్లోపే విచారణను పూర్తి చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చి.. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అక్రమాస్తుల సంపాదన కింద నమోదు చేసిన కేసులో నికేశ్‌కుమార్ రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో కొనసాగుతున్నారు. మధ్యవర్తుల సమక్షంలో డాక్యుమెంట్లను, బంగారు ఆభరణాలు, బ్యాంకు ఖాతాలకు చెందిన వివరాలను నిందితుడితోపాటు వారి కుటుంబ సభ్యులనుంచి కూడా తెలుసుకున్నారు. ఇప్పటివరకు అక్రమ సంపాదన కేసుల్లో దేవికా రాణి ప్రథమ స్థానంలో ఉండగా, నికేశ్‌కుమార్ కేసు రెండో స్థానంలో నిలిచినట్టు ఏసీబీ అధికారులు ప్రకటించారు. తాండూరు స్వస్థలం, హైదరాబాద్‌లో నిందితుడి పేరిట, బంధువులపై బినామీ పేర్లమీద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 2016నుంచి స్థిర, చరాస్తుల కొనుగోలుకు చెందిన కీలక పత్రాల ఆధారంగా వాటి విలువ లక్షలకుపైనే నని విచారణలో బయటపడ్డాయి.

నేరాంగీకార పత్రంలో నమోదైన ఆస్తుల వివరాలు..

బంగారు ఆభరణాలు : గోల్డ్ చైన్ (15గ్రా.), 11 ఫింగర్ రింగ్స్ (23గ్రా.), ఫింగర్ రింగ్ (5గ్రా), బ్రాస్‌లెట్ (4గ్రా), బ్లాక్ బీడ్స్ చైన్ (10గ్రా), బంగారు రూబీ స్టోన్ (5గ్రా), బంగారు వైట్ బీడ్స్ (5గ్రా), గోల్డ్ చైన్ లాకెట్ (4గ్రా), బ్యాంగిల్ పెయిర్ (5గ్రా), మూడు రింగులు (5గ్రా), బ్రాస్‌లెట్ (10గ్రా), మంగళ సూత్రాలు -2 (40గ్రా) బంగారు ఆభరణాల వివరాలను నికేశ్‌కుమార్ భార్య వీణాధారి తెలిపిన ప్రకారం ఏసీబీ అధికారులు నమోదు చేసుకున్నారు. నిందితుడి తల్లి మహాలక్ష్మి సహాయంతో మాస్టర్ బెడ్‌రూంలో హెరూర్ కల్పన, హెరూర్ నికేశ్‌కుమార్, కె.వీణాధారిలపై ఉన్న బీమా పత్రాలను తీసుకున్నారు. నిందితుడిపేరుతో పాటు కుటుంబ సభ్యులపై ఉన్న బండ్లగూడ, సుల్తాన్‌బజార్, ఎల్లారెడ్డిగూడ ఎస్‌బీఐ బ్రాంచీల్లో బ్యాంక్ ఖాతాలకు చెందిన అకౌంట్ నంబర్లను నమోదు చేశారు.

స్థలాలు: ఓపెన్ ప్లాట్ (సర్వేనం.51, సర్వేనం.52లలో 266 గజాలు) బండ్లగూడ జాగీర్ అప్పటి మార్కెట్ విలువ ఆధారంగా (రూ.13,30,000), 2016లో శంకర్‌పల్లిలో రెండు ఎకరాల భూమిని రూ.1.5లక్షలకు , మరో 138 గజాల ఓపెన్ ప్లాట్‌ను 1.66లక్షలకు కొనుగోలు చేశారు. తాండూరు, మల్‌రెడ్డిపల్లిలోని ఇండిపెండెంట్ హౌజ్ 90 గజాల్లో నిర్మాణం. మరొక 109 గజాల ఇల్లు తాండూరులో ఉంది. వాసవీ అట్లాంటిస్‌లో రూ.15 లక్షలతో విల్లా, 177 గజాల ఓపెన్ ప్లాట్ చిల్కూరు గ్రామంలో ఉండగా.. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ జప్తు చేసింది. పత్రాలపై సాక్షుల సంతకాలు తీసుకున్నారు. 10లక్షల రసీదు గురించి వీణాధరిని అధికారులు ప్రశ్నించగా తనకు ఈ విషయం తెలియదని తప్పించుకున్నారు. ఇద్దరు కుమారులు రంజిత్‌కుమార్, నికేశ్‌కుమార్, ఒక కుమార్తె శివాణి తేజలు ఒకే ఇంటిలో నివసిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ ఇవి పదిరేట్లు అధికమని భావిస్తున్నారు.

నుమాయిష్ కోసం ఏర్పాట్లు

అబిడ్స్, డిసెంబర్ 23: దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అయిన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు చేపట్టేందుకుగానూ నగరంలో నిర్వహించనున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్) ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను నిర్వహిస్తారు. పారిశ్రామిక ప్రదర్శనకుగాను దాదాపు 2500 స్టాళ్ల నిర్మాణం చేసేందుకుగానూ స్టాళ్ల నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివరి దశకు చేరుకుంది. ఇప్పటి వరకు స్టాళ్లను పొందిన నిర్వాహకులు పనులు చేపట్టారు. జనవరి ఒకటవ తేదీ ప్రారంభోత్సవం నాటికి దాదాపు అన్ని స్టాళ్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ప్రభాశంకర్‌లు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకుగాను అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే దాదాపు స్టాళ్ల కేటాయింపులు పూర్తి కావడంతో పలు స్టాళ్ల నిర్మాణానికి గాను ఏర్పాట్లు సాగుతున్నాయి. అలాగే.. ఈ సారి ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుమును రూ.50 గా ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీలో నిర్ణయం తీసుకున్నట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ప్రదర్శనకు వచ్చే సందర్శకుల కోసం మరిన్ని వసతులు కల్పిస్తామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, సంయుక్త కార్యదర్శి మోహన్‌లు తెలిపారు.

ఔటర్ సర్వీస్ రోడ్డుపై ప్రమాదం

బీటెక్ విద్యార్థిని మృతి..యువకుడికి తీవ్రగాయాలు

శివానీ (ఫైల్)

శేరిలింగంపల్లి, డిసెంబర్ 23: పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వెళ్లి.. తిరిగి హాస్టల్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్‌రోడ్డుపై వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో బీటెక్ విద్యార్థిని మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా దోమకొండ ప్రాంతానికి చెందిన మెడికల్ షాపు యజమాని నర్సయ్య, పూజ దంపతుల కూతురు శివానీ(21) గండిపేటలోని సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. గండిపేట సమీపంలోని మై ఫెరల్స్ గర్ల్స్ హాస్టల్‌లో నివాసం ఉంటుంది. ఆదివారం నిజాంసాగర్ నవోదయ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉండగా.. ఇక్కడే చదివిన శివానీ ఉదయం 5 గంటలకు వెళ్లింది.. అనంతరం సాయంత్రం కూకట్‌పల్లిలో బస్సు దిగి దుండిగల్‌లో నివాసం ఉండే స్నేహితుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకట్‌రెడ్డికి ఫోన్ చేసింది. దీంతో అతను వచ్చి.. తన ద్విచక్రవాహనంపై శివానీని తీసుకొని గండిపేట్‌లోని హాస్టల్‌లో దించేందుకు బయలుదేరాడు. మార్గమధ్యలో రాత్రి 1.30 గంటల సమయంలో నానక్‌రాంగూడ ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్‌రోడ్డుపై వీరి వాహనాన్ని వెనకనుంచి అతివేగంగా దూసుకువచ్చిన స్కోడాకారు (టీజీ09 3309) ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై నుంచి వారిద్దరు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు వారిని కొండాపూర్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా అప్పటికే శివానీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకట్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి సైతం విషమంగా ఉండడంతో మదీనాగూడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. స్కోడాకారును నడిపి ప్రమాదానికి కారణమైన శ్రీకాలేశ్‌ను అదుపులోకి తీసుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

జల్సాలకు అలవాటుపడి.. గంజాయి రవాణా

నిందితుడు అరెస్ట్.. 9.3 కిలోలు స్వాధీనం

మాదాపూర్, డిసెంబర్ 23: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శంషాబాద్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. జియాగూడకు చెందిన శ్రీకాంత్ జల్సాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలన్న లక్ష్యంతో గత మూడు, నాలుగు సంవత్సరాల నుంచి బీదర్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేయడం మొదలుపెట్టాడు. ఎక్సైజ్ శాఖ పోలీసులకు అందిన సమాచారంతో గచ్చిబౌలి గోపన్‌పల్లి తండాలోని ఫ్లైఓవర్ వద్ద నిందితుడు శ్రీకాంత్ రోడ్డు దాటుతుండగాఎక్సైజ్ పోలీసులు ఆపి అతని బ్యాగును తనిఖీ చేశారు. దీంతో రూ. 2.32 లక్షల విలువైన 9.3 కిలోల గంజాయి బయటపడింది. గంజాయితో పాటు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని .. నిందితుడు శ్రీకాంత్‌ను రిమాండ్‌కు తరలించారు.

వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి

ఫుడ్ కలర్లతో నకిలీ టీ పౌడర్ తయారీ..

నిందితుడు అరెస్ట్

మియాపూర్ , డిసెంబర్ 23 : అత్యంత ప్రమాదకరమైన ఫుడ్ కలర్స్‌తో నకిలీ టీ పౌడర్ తయారు చేస్తున్న ఓ కేంద్రంపై సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చందానగర్ సర్కిల్ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు దాడిచేసి, సదరు కేంద్రాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. చందానగర్‌లోని ఓ నివాసంలో చంద్రశేఖర్ అనే వ్యక్తి నకిలీ టీ పౌడర్ తయారు చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారిణి హృదయలు.. సదరు కేంద్రంపై దాడి చేసి.. టీ పౌడర్ తయారీకి రెండు రకాల ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు గుర్తించారు. ఈ నకిలీ టీ పౌడర్‌ను నగరంలోని మెహిదీపట్నం, టోలీచౌకి, తెల్లాపూర్, పటాన్‌చెరు, లింగంపల్లి, చందానగర్ ప్రాంతాల్లోని పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు కేంద్రం నుంచి రూ.1.20 లక్షల విలువైన 130 కిలోల టీ పౌడర్ సహా ఇతర ఫుడ్ కలర్స్, ఫ్లేవర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-326616

CHITS & DEPOSITS

★Regd. Chits: 5L, 10L, 15L, 20L, 25L, 50L & 1 Crore Chits. Commitment available. Contact: 8464919899.
NT-326882

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990.
NT-326901

TRAINING

★ఫొటోషాప్ ఉపయోగించి ఆల్బం డిజైన్ చేయడం నేర్చుకోండి. మీ ఇంటివద్దనే ఉంటూ నెలకు 50 వేల నుండి లక్ష వరకు సంపాదించే వెడ్డింగ్ ఆల్బం డిజైనింగ్‌ను ఉపాధిగా చేసుకోండి. Ph: +91 7382075928.
NT-339338

PLOT FOR SALE

★Bhongiri Yellamma Temple Opp. HMDA Villa Plots & Ghatkesar Two HMDA Villas "Low Cost". Cont: